## కాంగ్రెస్‌కు ఓటేస్తే..
# కష్టాలు గ్యారెంటీ



రోడ్డుషోలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కనే పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

- రైతుబంధు ఖతం కావాలా..? కాంగ్రెస్ ఖతం కావాలా..?
- కాంగ్రెస్‌కు ఓటేస్తే.. ఆగమే.. 3 గంటల కరెంటే..
- రేవంత్ కొడంగల్‌కా నై.. కామారెడ్డికా నై.. రేవంత్ పరిస్థితి
- రేవంత్‌కు రెండోసారి పరాభవం తప్పదు
- లీడర్‌లను కొనొచ్చు.. కొడంగల్ బిడ్డల ఆత్మగౌరవాన్ని కొనలేవు
- వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు

కొడంగల్, నవంబర్ 28 : సంక్షేమ పథకాలను అందుకోవాలంటే.. కేసీఆర్ సీఎం కావాలని, కాంగ్రెస్‌కు ఓటేస్తే.. ఆగం కాక తప్పదని వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూర్ మండలంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తరువాతే సాధించుకున్న తెలంగాణలో సంక్షేమం, అభివృద్ధి జాతర కొనసాగుతుందన్నారు. రూ.కోట్లాది నిధులతో తెలంగాణ అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే.. ఆగం కాక తప్పదని, గతంలోని 50 ఏండ్ల పాలనే అందుకు నిదర్శనంగా పేర్కొన్నారు. గతంలో పదేండ్లు కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్న రేవంత్‌రెడ్డి గుడి కట్టలేదు.. బడి కట్టలేదన్నారు. కాంగ్రెస్‌కు అభ్యర్థులే లేరని, రేవంత్ ఎలా సీఎం అవుతాడని ప్రశ్నించారు. సీఎం కావాలంటే ముందు ఎమ్మెల్యే కావాలని ఎన్నిక ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి చెప్పడానికి ఇదే కారణమన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ వచ్చిన తర్వాత రైతుబంధు ఖతం, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు ఖతం అయ్యాయని మంత్రి హరీశ్‌రావు అన్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాకముందే వ్యవసాయానికి 3 గంటల కరెంటు సరిపోతుందని చెబుతున్నారని,



రోడ్డుషోకు హాజరైన ప్రజలు

వ్యవసాయానికి 3 గంటల కరెంటు సరిపోతుందా అని ప్రశ్నించారు.

### కేసీఆర్ వచ్చాకే..

కేసీఆర్ వచ్చాకే తండాలు జీపీలుగా మారాయని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సచివాలయానికి అంబేద్కర్ పేరుతో పాటు అంబేద్కర్ విగ్రహం, దొంగ కరెంటు పోయి 24 గంటల కరెంటు, తాగునీటి కష్టాలు పోయి మిషన్ భగీరథ పథకంతో ఇంటి ముందు స్వచ్ఛమైన కృష్ణాజలాలు, కోటి ఎకరాల మాగాణి, పేదింట్లో కల్యాణలక్ష్మి కాంతులు, కేసీఆర్ కిట్, హైదరాబాద్ కీర్తి ప్రపంచ వ్యాప్తి, రైతుబంధు, రైతుబీమాతో అన్నపూర్ణ రాష్ట్రంగా తెలంగాణ, గతంలో నేను రానుబిడ్డో సర్కారు దవాఖానకు అని ఉండగా నేడు పోదాం పద సర్కారు దవాఖానకు వంటి ఎన్నో అద్భుతాలు ఏర్పడం మార్పు కాదా అని ప్రశ్నించారు.

### నరేందర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే..

పట్నం నరేందర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే మద్దూర్‌ను మున్సిపాలిటీగా, మద్దూర్ మండల కేంద్రంలో రోడ్డు వెడల్పుతో పాటు స్ట్రీట్‌లైట్‌లతో సుందరీకరణ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. స్థానికం గా ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా దౌల్తాబాద్ ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు, నియోజకవర్గంలో డివిజన్ డివిజన్ కేంద్ర ఏర్పాటు చేస్తాన్నారు. బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే.. సీఎం కేసీఆర్ కాళ్లు పట్టుకొనైనా సరే కొడంగల్‌కు ప్రమోషన్ ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

### హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్..

అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడిన సీఎం కేసీఆర్‌కు పెద్ద మెత్తంలో ప్రజాదరణ ఉందని, హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ చరిత్రను సృష్టించనున్నట్లు మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి వివరించారు. మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమీషన్ డైరెక్టర్ సలీం, మాజీ జడ్పీటీసీ బాల్‌సింగ్, కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వీరారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెంకటయ్య, సర్పంచ్ అరుణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రచారం.. పరిసమాప్తం

**- సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఎస్‌ఎంఎస్‌లు నిషేధం**

- ఈ నెల 30 వరకు జిల్లా అంతటా అమల్లోకి 144 సెక్షన్.. మద్యం దుకాణాలు, బార్లు బంద్
- ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం
- రెండు నెలలపాటు ఆయా పార్టీల అభ్యర్థుల ప్రచారం
- బీఆర్‌ఎస్ అభ్యర్థుల ప్రచారానికి ఊరూరా బ్రహ్మరథం




ధన్నారం వార్డులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ (ఫైల్)

వికారాబాద్, నవంబర్ 28, (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగిసింది. దాదాపు రెండు నెలలపాటు జరిగిన ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. అయితే నిన్న, మొన్నటి వరకు ఊరూ, వాడల్లో మోగిన మైకులు మూగబోయాయి. సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదని ఇప్పటికే ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. మంగళవారం సాయంత్రం నుంచి శుక్రవారం వరకు మద్యం దుకాణాలు, బార్లు కూడా మూతపడనున్నాయి. సంబంధిత నిబంధనలను ఉల్లంఘిస్తే తగు చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. డబ్బు, మద్యం పంపిణీకి అడ్డుకట్ట వేసేందుకు ఇప్పటికే ఉన్న 9 బృందాల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు, మరో 9 బృందాలను నియమించి పక్కా నిఘా పెంచారు. మరోవైపు ఈ నెల 30 వరకు జిల్లా అంతటా 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. జిల్లాలో ఎక్కడైనా డబ్బు, మద్యం పంపిణీ చేస్తున్నట్లయితే సీ-విజిల్ యాప్ లేదా డయల్ 100 ద్వారా సమాచారామివ్వాలని సూచించారు. ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ జరుగనున్నది. పోలింగ్‌కు సంబంధించి జిల్లా ఎన్నికల యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. జిల్లాలో మొత్తం ఓటర్లు 9,60,376 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 1133 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బందోబస్తుకు చర్యలు చేపట్టారు.

### బీఆర్‌ఎస్ అభ్యర్థుల ప్రచారానికి ఊరూరా బ్రహ్మరథం...

బీఆర్‌ఎస్ అభ్యర్థులు దాదాపు రెండు నెలలపాటు ఊరూరా, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. వికారాబాద్ నియోజకవర్గ అభ్యర్థి మెతుకు ఆనంద్ ప్రచారంలో భాగంగా ఏ గ్రామానికి వెళ్లినా జనం స్వచ్ఛందంగా తరలివచ్చి జైకొట్టారు. వికారాబాద్ అభ్యర్థి ఆనంద్‌కు మద్దతుగా చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి అంతా తానై పక్కా గెలుపు వ్యూహంతో ముందుకెళ్లారు. ఆనంద్ కు మద్దతుగా ఆయన సతీమణి సబితా ఆనంద్‌తోపాటు బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కొడంగల్ నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా దూసుకెళ్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్ రెడ్డికి నియోజకవర్గంలో ఎక్కడా ప్రచారం నిర్వహించిన అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సంపూర్ణ మద్దతు తెలిపారు. కొడంగల్ నియోజకవర్గంలోని కొస్గి, మద్దూరు, కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ తదితర మండలాల్లో ముఖ్య నేతలు, కార్యకర్తల సమావేశాలతోపాటు ఊరూరా రోడ్‌షోలు, బైక్ ర్యాలీలతోపాటు ఇంటింటి ప్రచారాన్ని బీఆర్‌ఎస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి నిర్వహించారు. పరిగి నియోజకవర్గం నుంచి రెండోసారి బరిలో ఉన్న కొప్పుల మహేశ్‌రెడ్డికి సంబంధిత నియోజకవర్గ ప్రజల నుంచి అపూర్వ స్పందన వచ్చింది. ప్రచారంలో భాగంగా మండలాల కార్యకర్తల సమావేశాలు, గ్రామాల వారీగా రోడ్ షోలు ఇంటింటి ప్రచారం కూడా మహేశ్‌రెడ్డి నిర్వహించారు. నియోజకవర్గంలోని ఏ ఊరుకెళ్లినా మహేశ్‌రెడ్డికి సంబండ వర్ణాల ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మహేశ్‌రెడ్డికి మద్దతుగా ప్రచారంలో సతీమణి ప్రతిమ, సోదరుడు అనిల్ రెడ్డితో పాటు పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. తాండూరు నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా తాండూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లిన రోహిత్‌రెడ్డి వైపే అన్ని వర్గాల ప్రజలు నిలుస్తున్నారు. రోహిత్‌రెడ్డికి మద్దతుగా ఆయన సతీమణి ఆర్తి, తల్లి ప్రమోదినీరెడ్డి తాండూరు పట్టణంతోపాటు బషీరాబాద్, తాండూరు మండలాల్లోని గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

# మూడో విడుత ర్యాండమైజేషన్ పూర్తి



ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు తదితరులు

వికారాబాద్, నవంబర్ 28 : జిల్లాలో శాసనసభ ఎన్నికల నిర్వహణలో భాగంగా పీవోలు, ఏపీవోలు, వోపీవోలతో పాటు మైక్రో అబ్జర్వర్ల మూడో విడుత ర్యాండమైజేషన్‌ను నిర్వహించి పూర్తి చేశామని కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సాధారణ ఎన్నికల పరిశీలకులు ఆకాశ్, సుధాకర్ జైలాకో్స సమక్షంలో ఎన్నికల నిర్వహణలో భాగంగా పీవోలు, ఏపీవోలు, వోపీవోలతో పాటు మైక్రో అబ్జర్వర్ల మూడో విడుత ర్యాండమైజేషన్ నిర్వహించి ఎన్నికల సిబ్బందికి పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. అనంతరం మేరీనాట్ పాఠశాల ఆవరణలో చేపట్టిన ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్లను ఎన్నికల సాధారణ పరిశీలకులు, రిటర్నింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్ల నోడల్ అధికారి రాంబాబు, ఈడీఎం మహమూద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

### ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రతి ప్రభుత్వ ఉద్యోగీ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న ఎన్నికల విధుల నిర్వహణకు వచ్చే ఉద్యోగులందరూ ఉదయం 8 గంటలకు ఫెసిలిటేషన్ సెంటర్‌కు చేరుకొని పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఉదయం 9 గంటలకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకోవాలని సూచించారు. విధులకు ఆలస్యంగా వచ్చినా, గైర్హాజరైనా ఎన్నికల నిబంధనల ప్రకారం తీవ్ర చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

### నేడు, రేపు సెలవు

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలకు రెండు రోజులు సెలవులు ఇస్తున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న పోలింగ్ ఉంటుందని, ఈ సందర్భంగా ముందు రోజు పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని తెలిపారు. దీంతో ఈ నెల 29, 30 తేదీల్లో సెలవులు ఇస్తున్నట్లు తెలిపారు.

### రేపు కార్మికులకు..

శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 30న సెలవు ఇస్తున్నట్లు కార్మిక శాఖ జిల్లా సహాయ సంచాలకుడు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు కార్మికులందరికీ వేతనంతో కూడిన సెలవు ఉంటుందన్నారు. సెలవు దినాన్ని సద్వినియోగం చేసుకొని కార్మికులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.